## పేద ప్రజల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, జూన్ 9: నగరంలోని పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ ఎన్ రెడ్డి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీ కరించాల న్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడం వల్ల పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడ్డాయని ఆరోపించారు. నిరుద్యోగం పెరగడంతో ప్రజలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేద ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## దూరవిద్య ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంబీఏ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ మొదటి, మూడు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

## పేదలపై హైడ్రా ప్రతాపం సరైంది కాదు

మాదాపూర్, జూన్ 9: బిక్కుబిక్కుమంటూ గుడిసెలో చిన్న పిల్లలతో జీవనం సాగిస్తున్న పేద బతుకులపై హైడ్రా విషం చిమ్ముతుందని మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్ రాయల అన్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ మాదాపూర్‌లోని సున్నంచెరువులో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేద కూలీలను స్థలం ఖాళీ చేయాలంటూ హైడ్రా అధికారులు ఇబ్బందులకు గురి చేయడంతో సోమవారం బాధితుల సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ మాదాపూర్ డివిజన్ నాయకులు కార్తీక్ రాయల పార్టీ నాయకులతో కలిసి సున్నంచెరువులో పర్యటించి బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోర్టు ఆదేశాలను గౌరవించకుండా హైడ్రా అధికారులు అధికారాన్ని ఉపయోగించుకుని పేద ప్రజలను పదేపదే ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

### శంకుస్థాపన కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



తెలంగాణ పోలీస్ అకాడమీ వద్ద డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, పాల్గొన్న పోలీస్ సిబ్బంది తదితరులు

బండ్లగూడ, జూన్ 9 : నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఐదు కోట్ల 81 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తెలంగాణ పోలీస్ అకాడమీ వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులు, సన్ సిటీ బాలాజీ పాపాలల్ స్వీట్ హౌస్ వద్ద నిర్మాణ పనులు,తిరుమల హిల్స్, శ్రీనివాస నగర్, ఇంద్రారెడ్డి కాలనీలో, విగ్నేశ్వర కాలనీ, కేకేనగర్ ఫేస్-2, వెంకటేశ్వర కాలనీ, శివసాయి నగర్, విష్ణుప్రియ కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ,రోడ్డు వెడల్పు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బండ్లగూడ మున్సిపాల్ కార్పొరేషన్ అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పూలపల్లి కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్రీనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కాముని చెరువులో గుర్రపు డెక్క తొలగింపు




కాముని చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ జాయింట్ డైరక్టర్ సంధ్య, కమిషనర్ సుమన్‌రావు తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 9 : శంషాబాద్ మున్సిపాలిటీలో కాలుష్య నివారణ కోసం ఏర్పాటు చేసిన వందరోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం శంషాబాద్ పట్టణంలోని కాముని చెరువును సగానికి పైగా ఆక్రమించుకొని పెరుగుతున్న గుర్రపు డెక్కను శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకొని గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ జాయింట్ డైరక్టర్ సంధ్య మాట్లాడుతూ కాలుష్య నివారణ కోసం వందరోజుల ప్రణాళిక ఏర్పాటు చేశామన్నా రు. అందులో భాగంగా కాముని చెరువులో నీటిపై పెరుగుతున్న గుర్రపు డెక్కను పూర్తిగా తొలగిస్తామని వివరించారు. అందులో భాగంగా సోమవారం గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభించిన్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో గుర్రపు డెక్కను తొలగించి కాముని చెరువులో నీరు కాలుష్యం కాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ము స్పల్ కమిషనర్ సుమన్‌రావు, ఏఈ నరేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు ఉద్యమించాలి

మియాపూర్, జూన్ 9: అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు మియాపూర్ ఎంఏనగర్ ఆఫీసులో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు ప్రారంభ ఉపన్యాసకులుగా జస్టిస్ చంద్ర కుమార్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ తన రెండోసారి ప్రభుత్వం ఏర్పడిన కాలంలోనే మోదీ విద్యారంగంలో కేంద్రీకరణ కార్పొరేటీకరణ, కషాయీకరణను వేగవంతం చేయడానికి నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి అందులో భాగంగా ఈ మధ్య కాలంలో ఎన్‌టీఏ లాంటి కేంద్రీకృత విధానాలకు ఆమోదముద్ర వేసి పేపర్ లీకేజీ కావడం, అమ్ముకోవడానికి ప్రోత్సహించడం వలన నీటి పరీక్ష రాసిన 24 లక్షలకు పైగా విద్యార్థులకు అన్యాయం చేశారన్నారు. నూతన జాతీయ విద్యా విధానంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విధానం లేదన్నారు.



## నల్లపోచమ్మ దేవాలయంలో..

*బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో స్థానిక మాజీ కార్పొరేటర్ గోకరి శ్రీలత ఆధ్వర్యంలో నిర్మించిన నల్ల పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు నిర్వహించారు.సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ నల్ల పోచమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్ గౌడ్ , మాజీ సర్పంచ్ పూలపల్లి కృష్ణారెడ్డి,మాజీ కార్పొరేటర్లు సాగర్ గౌడ్ నాయకులు పాపయ్య యాదవ్ సంగారెడ్డి హరీశ్‌గౌడ్ చంద్ర ప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. – బండ్లగూడ, జూన్ 9*

# పన్ను రహిత బాండ్లు

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హడ్కో) దీర్ఘకాలిక పెట్టుబడులపై విధించే క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ మినహాయింపు బాండ్లపై చర్చాగోష్టిని నిర్వహించింది. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్‌కృష్ణలో సోమవారం జరిగిన ఈ సమావేశంలో.. ఏప్రిల్ 7న సీబీడీటీ విడుదల చేసిన నోటిఫికేషన్‌పై వివరించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా హడ్కో ఇప్పుడు ఈ-బాండ్లను జారీ చేసే అర్హత పొందిందనీ, ఈ-బాండ్లను ఎంపిక చేసుకుంటే పన్ను భారం తప్పుతుందని హడ్కో డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రీజనల్ హెడ్ దల్జీత్ సింగ్ ఖత్రీ, ఎల్వీఎస్ సుధాకర్‌బాబు వివరించారు.

ఈ బాండ్లలో 6 నెలలోపు రూ.50లక్షల వరకు పెట్టుబడి పెడితే దీర్ఘకాలిక ఆస్తి అమ్మకాల నుంచి మూలధన లాభాలపై విధించే పన్ను నుంచి మినహాయింపు పొందవచ్చన్నారు. ఐదేళ్ల మెచ్యూరిటీతో బాండ్లను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు పీ సుభాష్ రెడ్డి, రీజనల్ చీఫ్ చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్థిక సలహాదారులు, ఇతర వాటాదారులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి



రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఉప కమిషనర్ రవికుమార్

### ప్రజావాణి ఫిర్యాదులో విజ్ఞప్తి

బండ్లగూడ, జూన్ 9: రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ పరిధిలో విద్యుత్ దీపాల కోసం ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును సంబంధిత అధికారులకు అందజేసి విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుంది అన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.



## ఎల్వోసీలు..అందజేత

*అనారోగ్యాలతో దవాఖానలలో చికిత్స పొందుతున్న పేద ప్రజలను సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటుందని రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేటర్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న శ్రీరామ్ నగర్ కు చెందిన సయ్యద్ సిరాజ్ కు రూ. 1.50 లక్షలు, రహ్మత్‌నగర్‌కు చెందిన శశి రంజాన్ శర్మకు రూ. 3 లక్షల ఎల్వోసీలను లను బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. – జూబ్లీహిల్స్, జూన్ 9*




*బ్యాడ్మింటన్ పోటీల్లో.. సోమాజిగూడకు చెందిన పాశం శశాంక్ యాదవ్ ఇటీవల మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో జరిగిన బాలుర అండర్ 17 ఏండ్ల కేటగిరిలో జిల్లా బ్యాడ్మింటన్ పోటీల్లో మొదటి స్థానం సాధించాడు. –ఖైరతాబాద్*

# టీబీపై ప్రజలకు అవగాహన ఉండాలి



మైలార్‌దేవ్‌పల్లి యూపీహెచ్‌సీలో టీబీపై నిర్వహించిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో పాల్గొన్న డాక్టర్ పాపారావు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 9: టీబీపై ప్రజలకు అవగాహన పెంచడం చాలా అవసరం అని అదనపు డీఎంహెచ్‌వో, టీబీ నివారణ అధికారి డాక్టర్ పాపారావు అన్నారు. టీబీ రహిత భారతదేశ నిర్మాణ లక్ష్యంతో దేశవ్యాప్తంగా చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సోమవారం మైలార్‌దేవ్‌పల్లి యూపీహెచ్‌సీలో రాజేంద్రనగర్ టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో టీబీని గుర్తించి నిర్ధారించడానికి స్పుటం శాంపిల్స్, ట్రునాట్ , ఎక్సరే టెస్టులు వంటి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. మొత్తం 55 మంది రోగులకు ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ చేతన్, శ్రీనివాసుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో, టీబీ నివారణ అధికారి డాక్టర్ పాపారావు క్యాంపును సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధి అన్నారు. ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం చాలా అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రహీం, నరేష్‌కుమార్, చంద్రకళ, రోజారాణి, ఆశవర్కర్లు పద్మ, గీత, డాక్టర్ జాఫర్ పాల్గొన్నారు.



పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న ఓయూ అధికారులు

## పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీలలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను అధికారులు సోమవారం విడుదల చేశారు. ఓయూలో కేటగిరి 2 ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాలకు ఏప్రిల్ 25 నుంచి 27 వరకు కంప్యూటర్ ఆధారిత ప్రవేశపరీక్షలను వర్సిటీ నిర్వహించింది. మొత్తం 49 విభాగాల్లో ప్రవేశాలు పొందేందుకు 9,747 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 7,907 మంది పరీక్షలకు హాజరు కాగా, ఉత్తీర్ణత శాతం 62.60గా నమోదైంది. ఈ సందర్భంగా ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. విభాగాల వారీగా అభ్యర్థుల ర్యాంకు కార్డులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఈనెల 23 నుంచి పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్స్ ప్రొఫెసర్ జలపతి, డాక్టర్ అక్తర్ అలీ, డాక్టర్ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రకళ కు డాక్టరేట్

చిక్కడపల్లి: డాక్టర్ పంగులూరి చంద్రకళ సోమవారం అనురాగ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (Ph.D.) డిగ్రీని అందుకున్నా రు. ఆమె గణితశాస్త్ర విభాగంలో డాక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్టడీ ఆఫ్ ఎంహెచ్‌డీ కన్వెక్టివ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఫ్లో ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ అనే వినూత్న అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ.. ఈ పరిశోధన ఇంజినీరింగ్ రంగంలో, ముఖ్యంగా సౌరశక్తి, వేడి తగ్గించే పరికరాల తయారీ వంటి వాటిలో ఉపయోగపడుతుందని తెలిపారు. చంద్రకళకు డాక్టరేట్ రావడంపై ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## జీహెచ్‌ఎంసీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

బాలానగర్, జూన్ 9 : అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా ఉంటే జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి తాళం వేయక తప్పదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. సోమవారం ఓల్డ్‌బోయిన్పల్లి డివిజన్లో అన్ని విభాగాల అధికారులు, డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తో కలిసి ఆయన అస్మత్పేట బోయిన్ చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. చెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రెండేండ్ల కిందట రూ.17కోట్ల నిధులు కేటాయించి సుందరీకరణ పనులు చేపడితే ఇప్పటికీ పూర్తి చేయకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చెరువులో ఎప్పటికప్పుడు గుర్రపుడెక్క తొలగించే విధంగా చర్యలు చేపట్టే వారమని, ప్రస్తుతం అలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయగా.. కట్టపై వాహనాల పార్కింగ్ చేయడం ఎంత వరకు సమంజసం అని, సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని వాహనాలను తొలగించే ప్రయత్నం ఎందుకు చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. డీసెల్టింగ్ వ్యర్థాలను తీసుకువచ్చి చెరువు కట్టపై డంపింగ్ చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం మల్లికార్జున కాలనీలోని కార్పొరేటర్ నరసింహ యాదవ్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఆయనతో పాటు అన్ని విభాగాల అధికారులు కాలనీ సంఘాల ప్రతినిధులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సమస్యలను వివరించారు.

## జలమండలిలో ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించాలి

చిక్కడపల్లి,జూన్ 9: జలమండలిలో ట్రేడ్ యూనియన్‌లకు ఎన్నికలు నిర్వహించాలని పలు సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ బీ2898, టీఎంయూ-బీ 2706, ఎంహెచ్‌డబ్ల్యూ, ఎస్పీబీ -315, డబ్ల్యూ, డబ్ల్యూ యూ 2873, హెచ్‌ఎండబ్ల్యూ ఎస్‌ఎస్ బీయూబీ-1929, తదితర సంఘాల ప్రతినిధులు సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (JCL) సునీతను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సం దర్భంగా జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సతీశ్‌కుమార్, వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డిలు మాట్లాడుతూ.. గత సంవత్సరం మే నెలలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామన్న అధికారులు నేటికి పూర్తి చేయలేదని తెలిపారు.






## సర్కారు బడిలో సకల సౌకర్యాలు..

*సర్కారు బడిలో అన్ని సౌకర్యాలు ఉచితంగా అందుతున్నాయని.. ఖైరతాబాద్-2 మండలం డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించి ఉచిత విద్య సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. సోమవారం రహ్మత్ నగర్ డివిజన్ కార్మిక నగర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి ప్లే స్కూల్ విద్యను పూర్తి చేసుకున్న పిల్లలను స్థానిక పాఠశాలలో చేర్పించాలని కోరారు. అంతే కాకుండా పాఠశాల విద్యను మధ్యలో ఆపివేసిన డ్రాప్ ఔట్స్ ను గుర్తించి వెంటనే వారిని పాఠశాలలో చేర్పించాల్సిందిగా ఆదేశించారు. విద్య ప్రాముఖ్యతను వివరించే ప్ల కార్డులతో నినాదాలు చేస్తూ ప్రచారం నిర్వహించారు. – జూబ్లీహిల్స్, జూన్ 9*



## 'ప్రజావాణి'కి ఫిర్యాదులు రాలె..

*సమస్యల పరిష్కార వేదికగా ఏర్పాటు చేసిన ప్రజావాణికి స్పందన కరువైంది. జీహెచ్‌ఎంసీ -19వ సర్కిల్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి కొన్ని వారాలుగా ఒక్క ఫిర్యాదు కంటే ఎక్కువ రావడం లేదు. యూసుఫ్‌గూడలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని అధికారులు తెలిపారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 19వ సర్కిల్ డీసీ జాకియా సుల్తానా ఆధ్వర్యంలో ఎంటమాలజీ ఏఈ సావిత్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్, జూన్ 9:*

## 'గాంధీ'లో తాగునీటి ప్లాంట్ ప్రారంభం

బన్సీలాల్ పేట్, జూన్ 9 : గాంధీ దవాఖానలో రోగుల కోసం మంచుకొండ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత మంచి నీటి ప్లాంట్‌ను సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, మంచుకొండ ఫౌండేషన్ ట్రస్టీ వరుణ్ కుమార్‌లు ప్రారంభించారు. ఆరు 300 లీటర్ల ప్లాంట్‌లు, 20 వందల లీటర్ల వాటర్ కూలర్లను తమ ఫౌండేషన్ ద్వారా అందజేసినట్టు వరుణ్ కుమార్ తెలిపారు. వాటి నిర్వహణ బాధ్యత కూడా తమ ఫౌండేషన్ తీసుకున్నదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ.. రోగులకు మంచినీటి కూలర్లు, వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన మంచుకొండ ఫౌండేషన్ సంస్థ సేవాభావాన్ని అభినందిస్తున్నామని అన్నారు.

# వాంబే కాలనీలో జంతు కళేబరాలు, చర్మం తరలిస్తుండగా..

### రెండు డీసీఎంలను తగలబెట్టిన యువకులు
### భయాందోళనకు గురైన స్థానికులు



మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 9: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటు చేసుకున్నది. రెండు డీసీఎం వాహనాలకు స్థానిక యువకులు నిప్పు అంటించారు. ఈ ఘటనలో వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. వివరాల ప్రకారం కమాటిపురా నుంచి జల్‌పల్లికి ఏపీ10డబ్ల్యూ 0867, ఏపీ28టీసీ6806లలో రెండు డీసీఎం వాహనాలలో బక్రీద్ సందర్భంగా వధించిన జంతు చర్మాలు, కళేబరాలను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న జల్‌పల్లి ప్రాంతానికి చెందిన కొందరు యువకులు గుమ్మిగూడి వెంబడించి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వాంబేకాలనీ ప్రాంతంలో డీసీఎం వాహనాలను పట్టుకున్నారు.దీంతో ఒక డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోగా,మరో డ్రైవర్‌ను యువకులు పట్టుకొని దాడి చేశారు. అనంతరం రెండు డీసీఎం వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు నిప్పు అంటించారు. దాడి విషయాన్ని డ్రైవర్లు తమ డీసీఎం వాహనం యజమానికి తెలపడంతో వారి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలానికి సీపీ అవినాష్ మహంతి, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, సీఐ నరేందర్, రాచకొండ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని మంటల్లో కాలిపోతున్న డీసీఎం వాహనాలను ఆర్పివేశారు. అనంతరం అక్కడి నుంచి యువకులను పంపించే క్రమంలో ఆ యువకులు పోలీసుల పైకే రాళ్లు రువ్వారు.ఈ ఘటనలో ఇప్పటికే 15 మంది యువకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

### పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నం

అర్ధరాత్రి సమయంలో ఓ వర్గం ప్రజలు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించేందుకు యత్నించారు. స్టేషన్ ఆవరణకు చేరుకొని అకారణంగా డ్రైవర్‌పై దాడి చేయడంతో పాటు రెండు డీసీఎం వాహనాలను దగ్ధం చేశారని ఆందోళనకు దిగగా సీపీ అవినాష్ మహంతి వారిని సముదాయించారు. జరిగిన నష్టానికి పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని దాడి చేసిన వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు.

## వృద్ధుడు అదృశ్యం



యాదయ్య (ఫైల్)

శంషాబాద్ రూరల్, జూన్ 9 : వృద్ధుడు అదృశ్యమైన ఘటన సోమవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మండలంలోని సంఘీగూడ గ్రామానికి చెందిన వట్టెల యాదయ్య(72)కు అతడి భార్య మల్లమ్మకు కుటుంబ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో యాదయ్య మే 31న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎవ్వరికి చెప్పకుండా తన టీవీఎస్ బైక్‌ను తీసుకొని వెళ్లాడు. దీంతో భర్త కోసం చుట్టు పక్కల ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య మల్లమ్మ శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సెల్‌ఫోన్ దోచుకున్న దొంగలు

వెంగళరావునగర్, జూన్ 9 : వైన్ షాపునకు వెళ్లడానికి దారెటు అంటూ అడగడంతో.. అడ్రస్ చూపిస్తామని .. వెంటరమ్మని చెప్పిన ఇద్దరు దొంగలు వ్యక్తి వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కున్నారు. పారిపోతున్న దొంగల్లో ఒకడిని పట్టుకుని గట్టిగా కేకలు వేశాడు. అప్రమత్తమైన జనం ఆ ఇద్దరు దొంగల్లో ఒకరిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఎస్.ఆర్.నగర్ పోలీసుల కథనం ప్రకారం భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన పారా ప్రవీణ్ కుమార్ (39) మాదాపూర్ కాకతీయ హిల్స్‌లో ఉంటూ నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సోదరుడు ఇంటికెళ్లేందుకు ఆదివారం రాత్రి గ్రీన్ ల్యాండ్స్ వద్ద బస్సు దిగి అమీర్‌పేట్ మైత్రీవనం వెళ్తున్న సమయంలో తన ముందు నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వైన్‌షాప్‌నకు దారెటు అంటూ అడిగాడు. తన వెంట వస్తే చూపిస్తానని ఆ ఇద్దరు చెప్పారు. కొద్దిదూరం వచ్చాక ప్రవీణ్ జేబులోని సెల్‌ఫోన్‌ను దొంగలు బలవంతంగా లాక్కున్నారు. దొంగలు దొంగలు అంటూ బిగ్గరగా ప్రవీణ్ కేకలు వేస్తూ ఒకడిని పట్టుకున్నాడు. అప్రమత్తమైన జనం బాధితుడు వద్ద చేరుకుని ఎస్. ఆర్ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మరో దొంగను కూడా పట్టుకున్నారు. పట్టుబడ్డ నిందితులను కిషన్ థంగ్డే, రాహుల్ మస్కెగా గుర్తించారు. ఎస్.ఆర్.నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.